


రాచరిక వ్యవస్థ నుండి ప్రజాపాలన వ్యవస్థ ఆవిర్భావానికి నాంది


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 18 సెప్టెంబరు , 2026 | పేజీలు : 7


## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ...
# మెగా జాబ్‌మేళా
### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా 19న కోదాడ పట్టణంలో ప్రతిష్టాత్మక మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వ హించిన ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొని జెండా ఆవిష్కరణ అనంతరం ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతం లో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సదస్సు విజయవం తం కావడంతో, ఈ ఏడాది సెప్టెంబర్‌లో మరింత భారీ ఎత్తున కోదాడలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు వెల్లడించారు. ప్రపంచస్థాయి దిగ్గజ కంపెనీల భాగస్వామ్యంతో ఈ మెగాజాబ్‌మేళాకు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన సుమారు 300 ప్రముఖ కంపెనీలు తరలివస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ఐఫోన్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్తో పాటు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐటిసి, ఐసిఐసిఐ బ్యాంక్, అపోలో హాస్పటల్స్, ఎల్ అండ్ టి వంటి సంస్థలు పాల్గొంటున్నాయని వివరించారు. ఫార్మా రంగం నుంచి డాక్టర్ రెడ్డిస్ ల్యాబోరేటరీస్, దివీస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా, హెటిరో, ఎంఎస్ఎన్ ల్యాబ్స్‌తోపాటు ఎంఆర్‌ఎఫ్, టాటా ఎలక్ట్రానిక్స్, ఫ్లిప్‌కార్ట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, పేటిఎం వంటి దిగ్గజ సంస్థలు రిక్రూట్‌మెంట్ చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ఉమ్మడి జిల్లా పరిధిలోని సిమెంట్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ పరిశ్రమలు తప్పనిసరిగా స్థానిక యువతకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు ముందస్తుగా kodadmegajobmela.com పోర్టల్ సందర్శించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకే ఇంటర్వ్యూ సమయం, స్లాట్ కేటాయించడం జరుగుతుందని, కంపెనీల నిబంధనల ప్రకారం పరిమిత స్లాట్లు మాత్రమే అందుబాటులో ఉంటాయని కాబట్టి అర్హులైన అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ జాబ్‌మేళాను పరిశీలించేందుకు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల, ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరై అభ్యర్థులు, కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖిగా పాల్గొననున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె. నరసింహ, ఎఎంసి చైర్మన్ వేణారెడ్డి, సర్వోత్తమ్ రెడ్డి పాల్గొన్నారు.



## విశ్వకర్మ భగవానుడి సేవలు స్ఫూర్తిదాయకం
### గుత్తా సుఖేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి** : శిల్పకళ, నిర్మాణ రంగం, చేతివృత్తులు, సాంకేతిక నైపుణ్యాలకు విశ్వకర్మ భగవానుడి సేవలు స్ఫూర్తిదాయకమని తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గురువావారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భగవాన్ విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఇంచార్జి జిల్లా కలెక్టర్ భాస్కర్ రావు, ఎస్పీ అక్షాంష్ యాదవ్,రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి , గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ తో కలసి తెలంగాణ రాష్ట్ర శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి రాష్ట్ర విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. కుల సంఘాల నాయకులు,ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని, భగవాన్ విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి సుబ్బారెడ్డి, విశ్వబ్రాహ్మణ కుల నాయకులు, సంఘ నాయకులు, ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు.

## గొర్రెలు కాస్తున్న బాలుడికి గురుకులంలో అవకాశం..
### అనూహ్యంగా ఆత్మహత్యాయత్నం

**ప్రజాపక్షం/నందికొండ**: గొర్రెలు కాస్తూ చదువుకు దూరమైన నరేందర్ అనే బాలుడికి గురుకుల విద్య అందించేందుకు చేసిన ప్రయత్నం విషాదంగా మారింది.ఓఆశా వర్కర్ బాలుడి పరిస్థితిని గమనించి వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల సెక్రటరీ సైదులు దృష్టికి తీసుకెళ్లారు.మానవతా దృక్పథంతో స్పందించిన సైదులు ప్రత్యేక చొరవతో నందికొండ మున్సిపాలిటీలోని బీసీ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో సీటు కల్పించారు.అయితే గురువారం సాయంత్రం 5.10 గంటల సమయంలో బాలుడు పాఠశాల భవనంపైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది.తనకు చదువుకోవడం ఇష్టం లేదన్న విషయాన్ని బాలుడు ఇంతకు ముందు యాజమాన్యం దృష్టికి తీసుకురాలేదని పాఠశాల వర్గాలు తెలిపాయి.ఘటనను గమనించిన సిబ్బంది వెంటనే స్పందించి బాలుడిని కిందకు దించి ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఎస్‌ఎల్‌బిసి పూర్తి చేసి నల్లగొండ రుణం తీర్చుకుంటా



### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/తిప్పర్తి** : ఎస్‌ఎల్‌బిసీ సొరంగ మార్గాన్ని మే 2028 నాటికి పూర్తి చేసి జూన్ 2028లో నీటిని విడుదల చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.గురువారం నల్లగొండలో ప్రజాపాలన దినోత్సవ వేడుకల అనంతరం తిప్పర్తి, మాడుగులపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.దుప్పలపల్లి నుంచి కంకణాలపల్లి మీదుగా ఖాజీరామారం వరకు రూ.20 కోట్లతో,తిప్పర్తి నుంచి సర్వారం వరకు రూ.111 కోట్లతో చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్‌ఎల్‌బిసీ టన్నెల్ పూర్తయితే నల్లగొండ నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందని, రైతులు రెండు పంటలు పండించుకునే అవకాశం ఉంటుందన్నారు. సొరంగం కూలిన తర్వాత తిరిగి పనులు ప్రారంభించి ఇప్పటివరకు 600 మీటర్లు పూర్తి చేశామన్నారు. తిప్పర్తి,మాడుగులపల్లి మండలాల్లో విద్యుత్ సమస్య రాకుండా రూ.200 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేస్తామని, పజ్జూరు సమీపంలో 10 ఎకరాలు గుర్తించామని వెల్లడించారు.దుప్పలపల్లికి సబ్ స్టేషన్ మంజూరైందని,వచ్చే వారంలో శంకుస్థాపన చేస్తామన్నారు.మంత్రి వెంట ఆయా గ్రామాల సర్పంచులు ,ఇతర ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి ఉన్నారు.

**తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ క్లబ్ అభివృద్ధిలో ఆదర్శం: మంత్రి కోమటిరెడ్డి**



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ క్లబ్ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.నల్లగొండ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు(2026/29) నూతన సెక్రటరీ లయన్ డాక్టర్ గోలి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా,పుష్ప గుచ్ఛంతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1958లో స్థాపించిన క్లబ్ 68 ఏళ్లుగా దినదినాభివృద్ధి చెం దుతూ రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండడం అభినందనీయమని అన్నారు. మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చడం వల్ల అదే స్థాయిలో పట్టణం అభివృద్ధి చెందుతుందని, అందుకు తన వంతు కృషి ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు.గత కార్యవర్గ విజ్ఞప్తి మేరకు హైదరాబాద్‌లోని నాలుగు ముఖ్యమైన క్లబ్‌లతో నల్లగొండ క్లబ్‌ను అనుసంధానం చేయించామని, దీనివల్ల సభ్యులు కుటుంబంతో హైదరాబాద్ వెళ్లినప్పుడు తక్కువ ధరలో సదుపాయాలు పొందుతారని తెలిపారు.పట్టణాన్ని,జిల్లాను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని పేర్కొంటూ నూతన కార్యవర్గాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ, ట్రెజరర్ పి.వెంకటేశ్వర్లు, కల్చరల్ సెక్రటరీ సిహెచ్.విజయ్ కుమార్,గేమ్స్ సెక్రటరీ బి.వెంకట్ రెడ్డి,కార్యవర్గ సభ్యులు ఏదుల శ్రీధర్ రెడ్డి, ముత్యంరెడ్డి రాంబాబు,తేరా భాస్కర్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,విజయ్ భాస్కర్,రవీందర్ రెడ్డి,కర్ణాకర్ రెడ్డి,వెంకటకృష్ణ,రవీందర్ పాల్గొన్నారు.



## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/మునగాల:** మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ వ్యవస్థాపకులు ముత్యాల సత్యనారాయణ చారి మాట్లాడుతూ సృష్టికర్త విశ్వానికి నిర్మాణకర్త అయిన విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలని అన్నారు. అనంతరం విశ్వకర్మ భగవానిడి చిత్రపటానికి పూలమాలలువేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు ఇనుగుర్తి వీరచారి, దేవాలయ పురోహితుడు బాణాల లక్ష్మణచార్యులు, వేలది వెంకటప్పచారి, కాశీ నాగార్జునచారి, బంగారపు శ్రీనివాస్, ముత్యాల శివ, ముత్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 19న జాబ్‌మేళాను సద్వినియోగం

**ప్రజాపక్షం/కోదాడ:** జిల్లాలోని నిరుద్యోగ, యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారధ్యంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 19న మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నందున నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పాలడుగు సంజీవ్ కోరారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్టేషన్ చేసుకోవాలని, అర్హతను బట్టి సుమారు 3500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అపోలో, జిఎంఆర్, రాంకి, హహేంద్ర, సిమెంట్ పరిశ్రమలు, ఐటి ఫార్మ పరిశ్రమలు, నిర్మాణ సేవా రంగాలకు చెందిన 300 రకాల కంపెనీల భాగస్వామ్యంతో మెగాజాబ్ మేళాను కోదాడలోని సిసిరెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత కెసిఆర్‌దే

**ప్రజాపక్షం/బొమ్మలరామారం:** గిరిజనుల తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దే అని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గోవింద గ్రామంలో సెప్టెంబర్ 17వ తేదీని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా గిరిజన తండాల్లో నిర్వహిస్తున్న కెసిఆర్ కి ధన్యవాదాలు అనే కార్యక్రమంలో భాగంగా పాల్గొన్నారు. గిరిజనులకు 6% రిజర్వేషన్లను 10%కు పెంచిన ఘనత కెసిఆర్ దే అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పొలగాని వెంకటేష్ గౌడ్, సింగల్ విండో మాజీ చైర్మన్ గూదె బాల నరసయ్య, మండల నాయకులు జూపల్లి భరత్, మాజీ ఎంపీటీసీ పాచ్య నాయక్, మాజీ మార్కెట్ డైరెక్టర్ లింగా, గోవింద్ తండా గ్రామ ఉపసర్పంచ్ బీకు నాయక్, మాజీ సర్పంచ్ సక్కుబాయి పాల్గొన్నారు.



# ఐక్యతను చాటేలా గణేష్ నవరాత్రులు





**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి ఆధ్యాత్మికతతో పాటు సోదరభావం, ఐక్యతను చాటేలా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. గురువారం పట్టణంలో జరుగుతున్న శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శ్రీ సిద్ధి వినాయక స్వామివార్ల విగ్రహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నమస్కరించారు.అనంతరం వివిధ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాలలో ఆయన పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ వార్డుల ప్రజాప్రతినిధులు, వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**సమాజ నిర్మాణంలో విశ్వకర్మల పాత్ర అభినందనీయం- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

విశ్వకర్మ భగవానుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. గురువారం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని మిర్యాలగూడ పట్టణంలోని విశ్వకర్మ భవన్‌లో, అలాగే పెద్ద శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక యాగంలో పాల్గొని స్వామివారికి పూజలు సమర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మ సమాజ సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులకు నకిలీ మందులు అమ్మితే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వ్యవసాయ రంగంలో రైతాంగాన్ని మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉపేక్షించేది లేదని ఏడీఏ కొనిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మిర్యాలగూడ మండల కేంద్రంలోని పలు క్రిమిసంహారక మందులు, ఎరువుల విక్రయ కేంద్రాలలో స్థానిక మండల వ్యవసాయ అధికారి మేకల రుషేంద్రమనితో కలసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విక్రయ కేంద్రాలలో అనుమతి పత్రాలు, నాణ్యతా ప్రమాణాలు, నిల్వ ఉంచిన రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యాపారులు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి అమ్మకాలు సాగించాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్లలో ఉన్న లెక్కలకు, షాపుల్లో అందుబాటులో ఉన్న నిల్వలకు సరిగ్గా సరిపోలాలని స్పష్టం చేశారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ అధికారిక బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఫెర్టిలైజర్ యాప్ ద్వారా రైతులకు అందుతున్న యూరియా సరఫరా విధానాన్ని నిశితంగా పరిశీలించి, ఎక్కడా కొరత రాకుండా సమర్థవంతంగా పంపిణీ జరపాలని ఆదేశించారు.ఈ తనిఖీలలో వ్యవసాయ విస్తరణ అధికారులు జవహర్ బాబు, వాసు, సంతోష్, జగన్, అఖిల్ పాల్గొన్నారు.

# ఉచిత హెచ్‌పివి టీకాతో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బాలికలు, మహిళల ఆరోగ్యాన్ని కాపాడటంలో హెచ్‌పివి వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తుందని, అర్హులైన బాలికలందరూ ఈ టీకాను సద్వినియోగం చేసుకోవాలని ప్రకాష్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నిపున్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక సౌజన్యంతో విద్యార్థినులకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం 13 నుంచి 14 ఏళ్ల వయస్సు గల బాలికలు ఈ టీకా తీసుకోవడానికి అర్హులని, బహిరంగ విపణిలో ఎంతో వేల రూపాయిల వ్యయమయ్యే ఈ ఖరీదైన వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని వివరించారు. ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌తో పాటు ఇతర ప్రాణాంతక క్యాన్సర్లను సైతం సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని, టీకా భద్రతపై ఎవరూ ఎలాంటి సందేహాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థినుల భవిష్యత్తు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయినులు ఉమారాణి, సునంద, జ్యోతి, పద్మజ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలకు కొండంత అండ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని ఆచరణలో చూపిస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిల్లుట్ల రఘు ముందుకు సాగుతున్నారు. పార్టీకోసం అహర్నిశలు శ్రమించే కార్యకర్తల కుటుంబాలు కష్టాల్లోనూ భాగస్వామిగా నిలుస్తూ వారికి ధైర్యం కల్పిస్తూ భాగస్వామిగా నిలుస్తూ వారికి ధైర్యం కల్పిస్తున్న నాయకత్వానికి వెలిదండ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కొదాటి సైదులు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పిల్లుట్ల రఘు వెంటనే సైదులు కుటుంబాన్ని పరమార్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. వారికి 35వేల రూపాయలు అందించి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గుగులోతు కృష్ణ, కొనాయిగూడెం సర్పంచ్ సైదులు, శంభిరెడ్డి, వేణుయాదవ్, నల్లపాటి భాస్కర్, వెంకటరెడ్డి, దేవరం బాలకృష్ణ, గడ్డం అనిల్, కొంపెల్లి సోమయ్య, కామర్ల రవి పాల్గొన్నారు.

## మిర్యాలగూడ యువకుడికి లండన్ నగరంలో అరుదైన గౌరవం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణానికి చెందిన గణేష్ కుప్పాల లండన్ నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్ గౌరవాన్ని అందుకున్నారు. గురువారం లండన్ నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అధికారులు ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. మిర్యాలగూడలోని ఆదిలక్ష్మి, బాలస్వామి దంపతుల చిన్న కుమారుడైన గణేష్ స్థానికంగానే విద్యాభ్యాసం పూర్తి చేసి, ఉద్యోగ రీత్యా లండన్‌లో స్థిరపడ్డారు. సెప్టెంబర్ 16న లండన్ నగరంలో చట్టప్రకారం అవసరమైన ప్రతిజ్ఞ పూర్తి చేయడంతో డ్యామ్ సుసాన్ కారల్, కారొలైన్ లూయిస్ సమక్షంలో ఆయనను అధికారికంగా ఈ గౌరవానికి ఎంపిక చేశారు. కింగ్ ఛార్లెస్ III పాలనలోని 6వ సంవత్సరంలో భాగంగా అధికారిక రిజిస్టర్ పుస్తకంలో ఆయన పేరును నమోదు చేశారు.గతంలో కింగ్ ఛార్లెస్ III, క్వీన్ ఎలిజబెత్ II, ఫ్లోరెన్స్ నైటింగేల్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి మహానీయులు అందుకున్న ఈ విశిష్ట గౌరవాన్ని అతి పిన్న వయస్కుడిగా, అలాగే తెలుగు సమాజం నుంచి తొలి వ్యక్తిగా గణేష్ సాధించడం విశేషం. ఈ చారిత్రాత్మక ఘనత సాధించినందుకు బ్రిటీష్ పార్లమెంట్ సభ్యులు సీమా మల్హోత్రా, జస్ అథ్వాల్, వెస్ స్ట్రీటింగ్, మాజీ ఎంపీ వీరేంద్ర శర్మ, మట్టారెడ్డితో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

## సాయుధ పోరాట వీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి పోరాట ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య పిలుపునిచ్చారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని వై జంక్షన్ వద్ద ఉన్న వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఎంసిపిఐ(యు) నాయకులు, సామాజికవేత్తలతో కలిసి విగ్రహానికి పూలదండలు వేసి జోహార్లు అర్పించారు.భీమిరెడ్డి నరసింహారెడ్డి, మద్దికాయల ఓంకార్, పుచ్చలపల్లి సుందరయ్య, ధర్మభిక్షం, మద్దికాయల లక్ష్మక్క, ఆరుట్ల కమలాదేవి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, మల్లు స్వరాజ్యం వంటి మహనీయుల పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని నేటి ప్రజలు హక్కుల సాధన కోసం నిలబడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సామాజికవేత్త జె. రాజు, ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి, జిల్లా నాయకులు వల్లమల ఆశీర్వాదం పాల్గొన్నారు.





## నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మిషన్ భగీరథ మంచి నీరు, బోరు నీళ్లను కొండమల్లేపల్లి గ్రామంలోని ప్రతి ఒక్కరు పొదుపుగా వాడుకోవాలని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి గ్రామ ప్రజలకు సూచించారు. కొండమల్లేపల్లి గ్రామంలోని 7వ వార్డులో నిరుపయోగంగా ఉన్న పాత బోరును రిపేరు చేయించి, కొత్త మోటార్ బిగింపచేసి గురువారం వార్డు ప్రజలకు నీటి సౌకర్యం కల్పించారు. సమస్యను పరిష్కరించినందుకు వార్డు ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో 7వ వార్డు సభ్యుడు మౌలాన నజీర్, మాజీ వార్డు సభ్యుడు గుమ్మడవెల్లి జనార్ధన్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గిరిజనోత్సవం



**ప్రజాపక్షం/చివ్వేంల :** గిరిజనోత్సవం మండలంలోని మొగ్గాయిగూడెంలో గ్రామ బిఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జి జిల్లా నాయకులు బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించి, కెసిఆర్, కెటిఆర్, జగదీష్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి జాతీయ సమైక్య దినోత్సవాన్ని జరుపుకున్నారు. కెసిఆర్ పరిపాలన కాలంలో గిరిజనులకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి పలువురు నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు శిగ ఉప్పలయ్య, భూక్యా వెంకన్న, రణబోతు నరేష్ రెడ్డి, ధరవత్ భీమ్లా, భూక్యా నాగు, గుగులోత్ లచ్చు, బుద్దె ప్రసాద్, పంతంగి రామాచారి పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాటూర్ సర్పంచ్ జెన్నే సిద్దులు అన్నారు. ఆయన గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రెండో విడత ప్రభుత్వ ఉచిత యూనిఫామ్స్ పంపిణి చేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి ఉచితంగా యూనిఫామ్స్ పంపిణీ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరవెల్లి శ్రీకాంత్ రెడ్డి, ఎఎపాసి చైర్మన్ సూదగాని బబిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## నల్లగొండ నుంచి ధ్యాన్ చంద్ లాంటి క్రీడాకారులు రావాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా నుంచి ధ్యాన్ చంద్ లాంటి గొప్ప క్రీడాకారులు రావాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని మేకల అభినవ స్టేడియంలో ఖేలో ఇండియా హాకీ కేంద్రంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు హాకీ క్రీడా సామాగ్రి పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాకీలో పేరు ప్రఖ్యాతులు సాధించేందుకు క్రీడాకారులు నిరంతర కృషి, పట్టుదలతో సాధన చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా సామాగ్రిని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లాలో మంచి కోచ్ లు ఉన్నారని వారి సేవలను వినియోగించుకోవాలని కోరారు. జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లే క్రీడాకారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మేయర్,జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఇండియా ప్రాబబుల్స్ కు ఎంపికైన గణేష్, రాకేష్ లను అభినందించారు.స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఖేలో ఇండియా హాకీ సెంటర్ కు రూ.2 లక్షలు మంజూరు చేయగా, ఆ నిధులతో 40 మంది క్రీడాకారులకు సామాగ్రి పంపిణీ చేశారు.కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్,హాకీ జిల్లా కార్యదర్శి ఇమాం కరీం, కోచ్ ఎండీ యావర్,ఫుట్ బాల్ సెక్రెటరీ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి రేవంత్ సర్కార్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బడుగు,బలహీన,దళిత సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం దేశానికి ఆదర్శమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న కైలాష్ అన్నారు.గురువారం సెప్టెంబర్ 17 ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శివాజీ చౌరస్తాలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద జాతీయ జెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి ప్రధాని నెహ్రూ, హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ సాహసోపేత నిర్ణయాల వల్ల నిజాం సంస్థానం భారత్ లో విలీనమైందని గుర్తు చేశారు.స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ విముక్తి పోరాటంలో లేని బీజేపీ నేడు విమోచన అంటూ హడావిడి చేయడం సిగ్గుచేటని విమర్శించారు. 2029లో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జిల్లాపల్లి పరమేష్,జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ముంతాజ్ అలీ, ప్రధాన కార్యదర్శులు ఏళ్ల రవీందర్ రెడ్డి,మేకల రాజేందర్ రెడ్డి, పగిళ్ల రాజు,చర్లపల్లి గౌతమ్,మద్దిమడుగు రామ స్వామి,వంగాల వెంకట్ రెడ్డి,నవీన్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## సృష్టికి మూలకర్త, దేవ శిల్పి విశ్వకర్మ



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సృష్టికి మూలకర్త, దేవ శిల్పి అయిన భగవాన్ విశ్వకర్మ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం సూర్యాపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి)లో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ భగవాన్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వకర్మ జయంతి ప్రాముఖ్యతను పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భగవాన్ విశ్వకర్మను సృష్టికి మూలకర్తగా, దేవ శిల్పిగా భక్తులు కొలుస్తారన్నారు. ప్రతి సంవత్సరం కన్యా సంక్రాంతి సందర్భంగా విశ్వకర్మ జయంతిని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఇంజనీర్లు, చేతివృత్తుల వారు, మెకానిక్‌లు, కార్మికులు, పరిశ్రమల యజమానులు తమ వృత్తినైపుణ్యాలు మరింత అభివృద్ధి చెందాలని, పనుల్లో నైపుణ్యం, సామర్థ్యం పెంపొందాలని విశ్వకర్మను భక్తిశ్రద్ధలతో స్మరించుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి విశాల్‌ధార, విశ్వబ్రాహ్మ విశ్వకర్మ జిల్లా అధ్యక్షులు పోతుగంటి వీరాచారి, విశ్వకర్మ సీనియర్ నాయకులు బండపల్లి పాండురంగాచారి, శ్రీపాద భాస్కరాచారి పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధికి 45 రోజుల కార్యాచరణ



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి 45 రోజుల కార్యాచరణపై గురువారం వలిగొండ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ కమిషనర్, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి కె.ఎం.వి. జగన్నాధరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.జలంధర్ రెడ్డి, తహశీల్దార్ ఏ.దశరథ్, మార్కెట్ కమిటీ వలిగొండ చైర్మన్ బి. భీమా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ గరిశె రవి, మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలతతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. వెటర్నరీ, వ్యవసాయ, వైద్య, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఐ అండ్ బీ, హౌసింగ్, విద్యుత్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వివిధ శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సర్పంచులు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు సంబంధిత శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చి, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.



## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ,పీజీ విద్యార్థులకు అంతర కళాశాలల కబడ్డీ పోటీలను గురువారం ఎంజీయూ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.కార్యక్రమంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి,స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ మద్దిలేటి పాల్గొన్నారు.వ్యాయామ విభాగ అధ్యాపకులు డాక్టర్ రమావత్ మురళి,డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ కళాశాలల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. మొత్తం 13 మహిళల జట్లు, 13 పురుషుల జట్లు పాల్గొన్నాయని, గెలుపొందిన జట్లు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఎంజీయూకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.శుక్రవారం సెమీఫైనల్, ఫైనల్ నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మైహోమ్ భూముల విషయంపై సిఎం ప్రకటన హర్షణీయం

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మేళ్లచెరువులో మైహోమ్ సిమెంట్ సంస్థ సాగించిన భూ కబ్జాల వ్యవహారాన్ని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించడం పట్ల బాధితుల తరుపున న్యాయవాది కమతం నాగార్జున హర్షం వ్యక్తం చేశారు. గురువారం మేళ్లచెరువులో ఆయన ఆఫీస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సిఎం అదేశాల మేరకు మైహోమ్ రామేశ్వరరావు భూకబ్జాలపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేళ్లచెరువు సర్వే నెంబర్ 1057లోని 185 మంది రైతులకు చెందిన 220 ఎకరాల పట్టా భూములను అక్రమంగా భూభారతి 22ఏ నిషేదిత జాబితాలోకి చేర్చారని నాగార్జున మండిపడ్డారు. దీనిపై రైతులు గత ఐదు నెలలుగా పోరాడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మైహోమ్ సంస్థ అక్రమంగా కబ్జా చేసిన భూదాన్, సిలింగ్ ప్రభుత్వం భూములను కాపాడుతూ పేద రైతుల పట్టా భూములను మాత్రం నిషేదిత జాబితాలో పెట్టి వేధిస్తున్నారని ఆయన అరోపించారు.

## జగదాంబ దేవాలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి చేర్చడంపై గ్రామస్తుల అభ్యంతరం

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల పరిధిలోని రాఘవపురం గ్రామంలోని జగదాంబ తల్లి దేవాలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి చేర్చడంపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం విచారణ లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారని గురువారం కలెక్టర్, ఎస్పీ లకు వినతిపత్రం అందించారు. సాతులూరి చిన్న శంభయ్య కుటుంబీకులు స్వయంగా నిర్మించుకుని తమ ఆచారాల ప్రకారం పూజలు చేసుకుంటున్న ప్రైవేట్ ఆలయాన్ని ఎండోమెంట్లో చేర్పించారని గ్రామపెద్దలు ఆరోపించారు. స్థానిక గ్రామ పంచాయతీకి కూడా దీనిపై ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని అన్నారు. ఆలయంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని, అలాగే ఈ దేవాలయ విషయంలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సుమారు 50 మంది గ్రామస్తులు అధికారులను కోరారు. వారిలో సాతులూరి వెంకటయ్య, బాబు, వెంకట్రావ్, మాధవరావు, కొడే సుబ్బారావు ఉన్నారు.







# త్యాగధనుల స్ఫూర్తితో ప్రజాపాలనను బలోపేతం చేద్దాం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : త్యాగధనుల స్ఫూర్తితో ప్రజాపాలనను మరింత బలోపేతం చేద్దామని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గుడిపాటి నర్సయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ముఖ్య అతిథిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.









**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజా పాలనా దినోత్సవ వేడుకలను మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వైభవంగా నిర్వహించారు. గురువారం వేడుకల్లో భాగంగా ఆర్డిఓ ఎస్.రమణారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి**; సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని ప్రజా పాలన దినోత్సవ వేడుకలను మండల కేంద్రంతో పాటు గ్రామాలలో, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయాలలో జాతీయ జెండాను ఎగురవేశారు.

**ప్రజాపక్షం/అనంతగిరి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని మండల పరిధిలోని చనుపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.

**ప్రజాపక్షం/నూతనకల్** : ప్రజాపాలన దినోత్సవ వేడుకలను మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయితీ కార్యాలయాలు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

**ప్రజాపక్షం/తుంగతుర్తి** : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ నిర్వహించారు.



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నల్గొండ జిల్లా నేరేడుగొమ్ము మండలంలో గురువారం సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

**ప్రజాపక్షం/రామన్నపేట** : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.








**ప్రజాపకం/మోటకొండూర్** : మోటకొండూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని పోలీస్ స్టేషన్, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో, వివిద పార్టీ కార్యాలయాలలో, గ్రామపంచాయతీ కార్యాలయాలలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసి ఘనంగా సంబరాలు నిర్వహించారు.

**ప్రజాపక్షం/బీబీనగర్** : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద చైర్మన్ పొట్టొల్ల శ్యామ్ గౌడ్ జాతీయ జెండా ఆవిష్కరించారు.



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజాపాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఆయా గ్రామాలలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు, ఇబ్రాహింపురం గ్రామంలో ఉపసర్పంచ్ నా గాయపల్లి శివరాములు జాతీయ జెండాను ఆవిష్కరించారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి నరసింహ జాతీయ జెండా ఎగురవేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచారు.

**ప్రజాపక్షం/చింతలపాలెం** : మండల కేంద్రంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయితీ కార్యాలయాలు, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.



**ప్రజాపక్షం/చివ్వెంల** : మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఎంపిడిఓ చక్రవర్తి సంతోష్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనిల్ కుమార్,ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వీరశేఖర్ జెండా ఆవిష్కరించారు.



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : తెలంగాణ ప్రజలు దొరల,భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా సాగించిన తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రలో చిర స్థాయిగా నిలిచిందని చౌటుప్పల్ మునిసిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు.సెప్టెంబర్ 17 ప్రజాపాలనలో భాగంగా మునిసిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఏగరవేశారు.

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి**:పజల అభిష్టం మేరకు అభివృద్ధే పరమావధిగా పనిచేస్తామని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.గురువారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఆయన మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయగీతం రాష్ట్రీయ గీతం ఆలపించారు.తెలంగాణ అమరవీరులకు ఘనంగా అంజలి ఘటించారు.అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై మిని ట్యాంకు పనులు శరవేగంగా జరుగుతున్నాయని త్వరలో యేళ్ళ నాటి కల సాకారం కానుందని అన్నారు.





**ప్రజాపక్షం/చండూరు:** చండూరు ఆర్డవో కార్యాలయం వద్ద ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వందనపు శ్రీదేవి జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు.



**ప్రజాపక్షం/రామన్నపేట** : తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బోగారం గ్రామపంచాయతీ ఆవరణంలో జాతీయ పతాకాన్ని బోగారం గ్రామ సర్పంచ్ కూనూరు సాయికుమార్ పతాక ఆవిష్కరణ చేశారు.

**ప్రజాపక్షం/భువనగిరి** : యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి.అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.వంశీకృష్ణ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నాంపల్లి:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు మండలంలోని 32 గ్రామ పంచాయతీలు,ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం జరిగాయి.తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అంబటి ఆంజనేయు లు జాతీయ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రజాపక్షం/నిడమనూరు:** ప్రజా పాలన దినోత్సవం మండల కేందంలో మండల పరిధి అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం తాసిల్దార్ జంగాల కృష్ణయ్య ఎంపీడీవో ఇమామ్ తదితరులు జాతీయ జెండా ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.



## 19న కోదాడలో మెగా జాబ్ మేళా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఉమ్మడి నల్గొండ జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు పొందేందుకు గొప్ప అవకాశం.ఈ నెల 19న సూర్యాపేట జిల్లా కోదాడలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.కోదాడ పట్టణంలోని సెయింట్ జోసెఫ్ సీసీఆర్ విద్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ జాబ్ మేళా జరుగుతుందని పేర్కొన్నారు.గురువారం జాబ్ మేళాపై జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ మేళాలో 250కి పైగా కంపెనీలు పాల్గొని వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ,టెక్నికల్ కోర్సులు చేసిన వారందరూ అర్హులని చెప్పారు. హాజరయ్యే అభ్యర్థులకు భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

**ప్రజాపక్షం/హాలియా:** ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గురువారం హాలియా మున్సిపల్ పరిధిలోని అలీనగర్ (14వ మైలురాయి) సమీపంలోని నాగార్జునసాగర్ ప్రధాన ఎడమ కాలువ వద్ద నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందే చేయాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్ఎస్పి ప్రధాన కాలువలో ఈ నెల 22 నుంచి 25 వరకు నీరు తగ్గకుండా ఒకే స్థాయిలో ఉండేలా చూడాలని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.నిమజ్జనం వద్ద గజ ఈతగాళ్లను, ఆపదమిత్ర వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని, పోలీసుతో పాటు 12వ బెటాలియన్ పోలీసు సేవలను సిద్ధంగా ఉంచాలని



చెప్పారు. నాలుగు రోజుల పాటు 24 గంటలు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, విగ్రహాల నిమజ్జనం అనంతరం చెత్తను వెంటనే తొలగించేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. క్రేన్లు, వాహనాలు, ఇతర సామాగ్రిని ముందే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.కార్యక్రమంలో మిర్యాలగూడ ఆర్‌డిఓ రమణారెడ్డి,డిఎస్పి రవి,సీఐ రాఘవరావు,ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## మహిళా సమాఖ్య పెట్రోల్ పంపును ఆకస్మికంగా తనిఖీ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నీలగిరి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్ఎల్‌బిసీ వద్ద నిర్వహిస్తున్న పెట్రోల్ పంపును జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పంపు నిర్వహిస్తున్న మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడి నిర్వహణలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేవని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెట్రోల్ పంపును సక్రమంగా నిర్వహించాలని,సిబ్బంది డ్రెస్ కోడ్ పాటించాలని సూచించారు.రికార్డులు,లెక్కలు రోజువారీగా నిర్వహించాలని,బయటి వాహనాలను పంపు ఆవరణలో నిలిపేందుకు అనుమతించవద్దని, పెట్రోల్ పోసుకున్న వెంటనే వాహనాలు వెళ్లేలా చూడాలని ఆదేశించారు. పరిశుభ్రత పాటించాలని,ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.త్వరలోనే ఈ పంపులో సీఎన్జీ గ్యాస్ సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

## 35వ రోజుకు చేరిన బుల్లెట్ ట్రైన్ రిలే నిరాహార దీక్షలు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బుల్లెట్ ట్రైన్ కోసం అఖిల పక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 35వ రోజుకు చేరుకుంది. దీక్షలో కోలాట కళాకారులు కూర్చోగా ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యమంలో భాగంగా శుక్రవారం జరిగే సూర్యాపేట బంద్‌కు ప్రజలు అందరూ స్వచ్ఛందంగా బంద్ చేసి సంపూర్ణ మద్దతు తెలిపాలని కోరారు. ఈ బంద్ ద్వారా మన ఆకాంక్షను ఢిల్లీ వరకు తెలిసేలా చేయాలన్నారు. దీక్షలో మాస్టర్ కైలాసం వెంకటేశ్వర్లు, ఇతరులు పాల్గొనగా అఖిలపక్ష నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్, మల్లు నాగార్జున్ రెడ్డి, చలమల నరసింహ, డేవిడ్ కుమార్, శివకుమార్, రమణాచారి, ధర్మార్జున్, సలిగంటి వీరేంద్ర, బూర మల్సూర్, జర్నలిస్టులు భూపతి రాములు, కందుకూరి యాదగిరి సంఘీభావం తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే ఉప్పల మల్సూర్ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు



**ప్రజాపక్షం/కోదాడ (మోతె) :** సూర్యాపేట నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే, ప్రజా ఉద్యమ నాయకుడు ఉప్పల మల్సూర్ కుటుంబ పరిస్థితులపై వచ్చిన వార్తను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం మోతె మండలం సిరికొండలోని మల్సూర్ కుటుంబ సభ్యులను స్వయంగా కలిసి వారి పరిస్థితులను పరిశీలించారు. మల్సూర్ కుటుంబం నివసిస్తున్న ఇంటిని, అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్సూర్ కోడళ్లు పుష్పలత, యశోదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇల్లు మంజూరు చేయిస్తూ జారీ చేసిన ప్రొసీడింగ్స్ ప్రతులను ఆయన అందజేశారు. కుటుంబ సభ్యుల ప్రస్తుత పరిస్థితులను పరిశీలించిన అనంతరం అర్హతల మేరకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సిరికొండలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి కేంద్రం మరమ్మత్తుల కోసం రూ.3లక్షలు కేటాయించారు. ఈ కార్యక్రమంలో మోతె తహశీల్దార్ వెంకన్న, ఎంపిడిఓ సందీప్ కుమార్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

## సుధీర్‌రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన ఎంఎల్‌ఏ బాలునాయక్




**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపిపి పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్‌రెడ్డి దశదిన కర్మ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ హాజరై పల్లా సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, సుధీర్‌రెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తి చేసి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈకార్యక్రమంలో వెంకటయ్యగౌడ్, సురేష్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, మల్లారెడ్డి, గోపాల్‌రావు, వెంకటేశ్వర్‌రావు, హరినాయక్, రాంసింగ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుల నిచ్చెన మెట్ల వ్యవస్థను రూపుమాపేందుకు మహిళలు చైతన్యం కావాలి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహిళలు చైతన్యమైనప్పుడే సమాజంలో కొనసాగుతున్న కుల నిచ్చెన మెట్ల వ్యవస్థను రూపుమాపడం సాధ్యమవుతుందని మాదిగ మహిళా సమైక్య జాతీయ అధ్యక్షురాలు తబిత మాదిగ అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జిఓ భవనంలో మాదిగ మహిళా సమాఖ్య,మహాజన మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన తబిత మాదిగ మాట్లాడుతూ మహిళల సామాజిక,ఆర్థిక అభివృద్ధి, ఆత్మగౌరవం,హక్కుల సాధన కోసం ప్రతి మహిళ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మహిళలను చైతన్యపరిచి మహాజన సోషలిస్ట్ పార్టీని బలోపేతం చేయాలని కోరారు.వివిధ జిల్లాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగానే ఉమ్మడి జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.అక్టోబర్ 2న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మద్యపాన నిషేధ నిరసనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.కార్యక్రమంలో తెలంగాణ అధ్యక్షురాలు పెద్ద గీత మాదిగ,ఉపాధ్యక్షురాలు జేపీ లత మాదిగ,జిల్లా నాయకురాలు కురుపాటి కమలమ్మ,ఎంఎస్‌పి మాజీ జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎంఆర్‌పిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ,అధ్యక్షుడు దున్న శివ,బొజ్జ దేవయ్య, మల్లేపల్లి రాంబాబు,వంగూరి విక్రమ్,వంగూరి ప్రసాద్,పొలిమేర దశరథ పాల్గొన్నారు.

## అర్చకులపై ఒత్తిడి తగదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తిరుమలగిరి సాగర్ మండలం చింతలపాలెం గ్రామంలో వినాయక చవితి పూజా వివాదంలో మరణించిన దత్తుప్రసాద్ శర్మ మృతికి సంతాపం తెలుపుతూ మిర్యాలగూడ పట్టణంలో అర్చకులు, పురోహితులు నిరసన ర్యాలీ నిర్వహించారు. గురువారం స్థానిక ఫ్లైఓవర్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ రాజీవ్ గాంధీ చౌరస్తా, బంగారుగడ్డ చౌరస్తా మీదుగా ఈదులగూడ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ సమాజంలో బ్రాహ్మణుల పట్ల గౌరవంగా మసలుకోవాలని, పూజల సమయంలో వారిపై ఎలాంటి మానసిక ఒత్తిడి తీసుకరావద్దని విజ్ఞప్తి చేశారు. వినాయక పందిళ్లలో కేవలం వినాయక చవితి పూజలు మాత్రమే నిర్వహించుకోవాలని సూచించారు. అలా కాకుండా ఉత్సవ కమిటీల ఒత్తిడికి లొంగి హోమాలు, కుంకుమ పూజలు, చండీ హోమాలు చేయడం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు పులి కృష్ణమూర్తి, పూల్లాభట్ల లక్ష్మీ నారాయణశర్మ, కురుమేటి రాధాకృష్ణశర్మ, చిట్యాల శ్రీనివాస్ శర్మ, నాగేందర్ శర్మ, పిల్ల లోకాచార్యులు, రాఘవాచార్యులు, కిరణ్ కుమార ఆచార్యులు, అనంత కృష్ణ, రామకృష్ణ, సుధాకర్ శర్మ, నాగభూషణశర్మ, శేషాచార్యులు, శబరిశర్మ, భైరవట్ల రాంబాబుశర్మ పాల్గొన్నారు.



## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాపక్షం/మునుగోడు:** పౌష్టికాహారం తీసుకోవడం వల్లే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,కిష్టాపురం సర్పంచ్ మలుగు శ్రీను అన్నారు.గురువారం మండలంలోని కిష్టాపురం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య పౌష్టికాహారం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ మహేశ్వరం భరత్,అంగన్వాడీ టీచర్లు మంజుల,సుజాత,గర్భిణీలు,బాలింతలు,గ్రామ మహిళలు పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ సూచించారు.తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పి జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన పోలీస్ అధికారులు,సిబ్బంది,జిల్లా ప్రజలకు ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,ఏఓ శివ ప్రసాద్,డిఎస్పి కే.శివరాం రెడ్డి, ఏఆర్ డిఎస్పి శ్రీనివాస్,సీఐలు,ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రపంచానికే తలమానికం తెలంగాణ సాయుధ పోరాటం





**ప్రజాపక్షం/చిట్యాల:** తెలంగాణ ప్రాంతంలో నిజాం, రాజకార్లు, భూస్వామ్య, దొరలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచానికే తలమానికమని సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా లక్ష్మయ్య అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని అమరవీరుల స్థూపం దగ్గర గురువారం జరిగిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గుండ్రాంపల్లి గ్రామంలో నిజాం తాబేదారు మగ్దూం సుమారు 200 మంది ఈ ప్రాంత వాసులను చంపేసి బావిలో పాతి పెట్టిన చరిత్రను ఈ నేల మరవదని అన్నారు. పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొడిగె సైదులు మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలలో నిజాం నిరంకుశం నుండి 3వేల గ్రామాలను సాయుధ పోరాట యోధులు విముక్తులను చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెప్టెంబర్ 17న సాయుధ పోరాట దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు కేతరాజు అంజయ్య, సీమ అంజయ్య,ఏర్పుల రాములు, బొబ్బల శంకర్‌రెడ్డి, రత్నం లింగస్వామి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుల పోరాటన్నీ స్మరించుకొని ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగొని గాలయ్య గారు సిపిఐ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో నారాయణపురం మండల కేంద్రంలో సాయుధ పోరాట అమరవీరుల స్థూపానికి శ్రద్ధాంజలి ఘటించి అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ అధికారికంగా సెప్టెంబర్ 17 ను అధికారికంగా జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు సుర్వి నరసింహ, వీరమల్ల యాదయ్య, మహ్మదాబాద్ సర్పంచ్ ముత్యాల అంజయ్య, కోతులాపురం సర్పంచ్ కురిమిద్ద వినోద, నారాయణపురం ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు పులమోని శంకర్, దుబ్బాక సంజీవ, జనగాం శంకరయ్య, పందుల యాదగిరి, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు కొండూరి రవితేజ, కే వినోద్, కొండూరి వంశీ ఎర్రోళ్ల లింగయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/వలిగొండ :** తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని తీసుకుని నేటి ప్రజా సమస్యలపై పోరాడాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎలగందుల అంజయ్య, పార్టీ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్ పిలుపునిచ్చారు. సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా వలిగొండ మండలంలోని నర్సాపురం, గోపరాజుపల్లి గ్రామాల్లో తెలంగాణ సాయుధ పోరాట స్వాతంత్ర్య సమరయోధులు కామ్రేడ్ బొడిగే వెంకటయ్య, బొడిగె అండమ్మ, పాలకూర్ల శంకరయ్య, యాస సత్తిరెడ్డి, మారోజు సత్తయ్యల స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాటి కాలంలో గ్రామాల్లో గ్రామ కమిటీలు, దళాలు ఏర్పాటు చేసి వెట్టిచాకిరీ విముక్తి కోసం కమ్యూనిస్టులు ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. ప్రజలను సమీకరించి వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాయుధ పోరాటం నిర్వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పోలేపాక యాదయ్య, గ్రామ శాఖ కార్యదర్శులు నార్కట్పల్లి మచ్చగిరి, సలిగంజి కృష్ణకుమార్, శాఖ సహాయ కార్యదర్శి ఓర్సు స్వామి, యాస జనార్ధన్‌రెడ్డి, వడ్డేపల్లి లక్ష్మమ్మ, పాలకూర్ల దర్శన్, పాలకూర్ల అంజయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/డిండి;** తెలంగాణ విలీన సాయుధ రైతాంగ పోరాట 78వ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం డిండి సిపిఐ ప్రజా భవన్ కార్యాలయంలో జాతీయ జెండాను సిపిఐ నల్గొండ జిల్లా సమితి సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ ఆవిష్కరించారు. అనంతరం సాయుధ రైతాంగ పోరాటం ముమ్మాటికి కమ్యూనిస్టుల పోరాటమేనని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి శైలేష్, కార్యవర్గ సభ్యులు కేశవులు, హుస్సేన్, ఏఐవైఎఫ్ జిల్లా అద్యక్షులు నవీన ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్, గోవర్ధన్, చక్రి, లింగమయ్య, బబ్లు, శ్రీను, చెన్నయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు :** భూమి కోసం,భుక్తి కోసం,వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలనకు,దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను ఎప్పటికీ మరవద్దని సిపిఐ మండల సహాయ కార్యదర్శి మందుల పాండు పిలుపునిచ్చారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలం పరిధిలో కోటికల్ గ్రామంలోని అమరుల స్థూపాల వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మునుగోటి దయాకర్,మిరియాల యాదయ్య,రొమ్ముల యాదయ్య, మిర్యాల బిక్షమయ్య,దండు వెంకటరమణ,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





## త్యాగధనుల స్ఫూర్తితో పేదల సంక్షేమానికి కృషి చేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎన్నో పోరాటాలు,త్యాగదనుల కృషి వల్ల సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం లో పేద ప్రజల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ఆపరేషన్ పోలోలో భాగంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ నిజాం పాలన నుండి విముక్తి పొందిందని, అనంతరం తెలంగాణ రాష్ట్రం కోసం ఎందరో త్యాగధనులు ఎన్నో పోరాటాలు చేశారని, భూమి కోసం,విముక్తి కోసం చేసిన పోరాటాల ఫలితంగా తెలంగాణ సిద్ధించిందని తెలిపారు. రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ రెడ్డి,డిఆర్ఓ దశరథ్,కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్ తదితరులు ఉన్నారు.

## ఆటోను ఢీకొట్టిన కారు

నలుగురికి గాయాలు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఆగిఉన్న ఆటోను కారు ఢీకొట్టడంతో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన గురువారం పట్టణంలో జరిగింది. ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఎదురుగా రమావత్ బాలకృష్ణ తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని పక్కకు నిలిపాడు. అదే సమయంలో నేరేడుచర్ల నుండి మిర్యాలగూడెం వైపు వెళ్తున్న కారు డ్రైవర్ బిఎల్ఎన్ శర్మ తన కారును అతివేగంగా ఆ జాగ్రత్తగా నడపడంతో ఆటోని ఢీకొట్టాడు. ఆటో డ్రైవర్ బాలకృష్ణతో పాటు ప్రయాణికులు తక్కెళ్ల సుజాత, తక్కెళ్ల రాకేష్, మీసాల శ్రావణిలకు గాయాలయ్యాయి. పక్కకు నిలిపిన 5 ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఆటోడ్రైవర్ బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గోపాల్‌రెడ్డి తెలిపారు.

## నేషనల్ సైన్స్ సెమినార్‌లో క్రిష్ణవేణి విద్యార్థికి జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి



**ప్రజాపక్షం/రామన్నపేట :** జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన నేషనల్ సైన్స్ సెమినార్‌లో మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి లో ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి తెలిపారు. ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ 2047 అంశంపై భువనగిరి జిల్లా కేంద్రంలోని బీచ్ మహల్ హై స్కూల్‌లో నిర్వహించిన సెమినార్ లో క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు తస్లీం ఖానం,ఎస్. శ్రీకారుణ్య పాల్గొని తమ అద్భుతమైన వీడియో ప్రదర్శన, అంశం పై విశ్లేషణతో అందరినీ ఆకట్టుకుని జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి సాధించినట్లు ఆయన తెలిపారు. గైడ్ టీచర్ మురళి విద్యార్థులకు సహకారం అందించిన ఉపాద్యాయులను ఆయనతో పాటు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జె.వి.ఎన్ ఎస్ మణి, పాఠశాల ఉపాద్యాయులు అభినందించారు.

## సంక్షేమ పథకాలు అందరికీ అందాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ప్రజలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేల అభివృద్ధి చెందేల ప్రతీ ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని పోచంపల్లి మండల ప్రత్యేక అధికారి బి సురేష్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.గురువారం ప్రజాపాలన దినోత్సవం సందర్బంగా ఆయన అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో కలిసి కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టి ప్రజలకిచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తుందన్నారు.

# వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో సుంకరి

పిఆర్‌టియూ టిఎస్ రాష్ట్ర సంఘం బలపరిచే అభ్యర్థిగా పోటీకి నిర్ణయం

**ప్రజాపక్షం/నల్లగొండ:** వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిఆర్‌టియూ టీఎస్ రాష్ట్ర సంఘం బలపరిచే అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ తెలిపారు.ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ఆశీస్సులతో ఎన్నికల బరిలో నిలవనున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా తన విద్యార్హతలు,ఉపాధ్యాయ సంఘాల్లో చేసిన సేవలు, తెలంగాణ ఉద్యమ అనుభవం,సామాజిక పరిచయాలను వివరించారు.నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఊరుమడ్ల గ్రామానికి చెందిన సుంకరి బిక్షం గౌడ్ ఎం.ఏ., బి.ఈడీ.బి.పీ.ఈడీ.విద్యార్హతలు కలిగి ఉన్నారు.35 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ఆయన,గత మూడు దశాబ్దాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు.2000 సంవత్సరం నుంచి పదేళ్లపాటు నల్లగొండ మండల పిఆర్‌టీయూ అధ్యక్షుడిగా,అనంతరం 15 ఏళ్లపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా పిఆర్‌టీయూ అధ్యక్షుడు,కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి వేలాది మంది ఉపాధ్యాయులకు నిస్వార్థంగా సేవలందించినట్లు వివరించారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుభవం :** గతంలో జరిగిన పలువురు ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల్లో తాను కీలకంగా పనిచేసినట్లు ఆయన తెలిపారు. ధర్మారెడ్డి,జనార్ధన్ రెడ్డి,పూల రవీందర్ తదితరుల విజయాల్లో తన పాత్ర ఉందన్నారు.గతంలో పల్లా రాజేశ్వర్ రెడ్డి రెండు సార్లు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసిన సమయంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పిఆర్‌టీయూ అధ్యక్షుడిగా ఆయన విజయానికి కృషి చేసినట్లు వివరించారు.ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విజయంలోనూ పిఆర్‌టీయూ సంఘం కీలక పాత్ర పోషించిందని, అందులో తాను కూడా భాగస్వామినని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉపాధ్యాయ కుటుంబాలు,వివిధ వర్గాల నుంచి మద్దతు,సహకారం లభిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.పిఆర్‌టీయూ టీఎస్ బలపరిచే అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుస్తానని,అవసరమైతే ప్రధాన రాజకీయ పార్టీ మద్దతుతో లేదా అభ్యర్థిగా పోటీ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని సుంకరి బిక్షం గౌడ్ తెలిపారు.



# ఘనంగా ప్రధానమంత్రి జన్మదిన వేడుకలు





ప్రజాపక్షం/బీబీనగర్ : భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా గురువారం బీబీనగర్ మండల కేంద్రంలో గల హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాపక్షం/అనంతగిరి: భారతదేశ ప్రధాని నరేంద్ర మోడి జన్మదినాన్ని పురష్కరించుకుని అనంతగిరి మండల కేంద్రంలో బిజేపి పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ప్రజాపక్షం/రామన్నపేట : బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా గురువారం రామన్నపేట సుభాష్ సెంటర్లో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.



ప్రజాపక్షం/చండూరు: సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా బిజెపి చండూరు మండల ,మున్సిపాలిటీ శాఖాల ఆధ్వర్వంలో తెలంగాణ విమోచన కోసం పోరాడిన అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి చండూరు మండల అధ్యక్షుడు , చామలపల్లి సర్పంచ్ ముదిగొండ ఆంజనేయులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/మోటకొండూర్ : మోటకొండూర్ మండల కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఎల్లంల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగరవేశారు.

ప్రజాపక్షం/దేవరకొండ; మండల కేంద్రంలోని కర్నాటిపల్లి ఎక్స్‌రోడ్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు నేనావత్ రామునాయక్ ఆధ్వర్యంలో సెప్టెంబర్17 తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాన్ని జాతీయ జెండా ఎగరవేసి ఘనంగా నిర్వహించడం జరిగింది.






ప్రజాపక్షం/తుర్కపల్లి : మండల కేంద్రంలో భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా బిజెపి రాష్ట్ర ట్రేడర్స్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి చలమయ్య ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.





## సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించం

ప్రజాపక్షం/నిడమనూరు: భూస్వామ్య పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించేది లేదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య హెచ్చరించారు,నిడమనూరు మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను,మండల కార్యదర్శి కందుకూరి కోటేష్,కొమండ్ల గురువయ్య,ఆకారపు నరేష్,ముత్యాల కేశవులు,వింజమూరు శివ,నడ్డి నాగరాజు,వింజమూరు పుల్లయ్య పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : భువనగిరి గంజ్‌లోని భజరంగ్ వ్యాయామశాల గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోతన ప్రమోద్ కుమార్, గ్రంథాలయ చైర్మన్ భజరంగ్ వ్యాయామశాల సత్యనారాయణ, సరగడ అమరేందరర, సరగడ కరుణ్,సాయికిరణ్ యాదవ్, రంగ్ కృష్ణ,రాజేష్, జగదీష్, సత్యం, దత్తు యాదవ్, వెంకటేష్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండల పరిధిలోని సోమవారం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కీర్తి వెంకటేశం అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ గురువారం వెంకటేశం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం కుటుంబానికి తనవంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బోల్ల సుదర్శన్, సీనియర్ నాయకులు బందారం లింగ స్వామి గౌడ్, బచ్చు శ్రీనివాస్, జిల్లా, మండల నాయకులు కృష్ణ, నాగయ్య, రామ నర్సు తదితరులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్ మల్గా మాధవికి సన్మానం

ప్రజాపక్షం/వలిగొండ : మేజర్ గ్రామపంచాయతీ వలిగొండ ఉపసర్పంచ్ మల్గమాధవి వెంకటేశ్‌ను మల్లేపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఉపసర్పంచ్ తమ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను తమ సొంత ఖర్చులతో విద్యార్థిని విద్యార్థులకు యూనిఫామ్ అందిస్తూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తున్నందుకు పాఠశాల తరఫున వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.





## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తిదాయకం

ప్రజాపక్షం/చౌటుప్పల్ : తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచంలోని పలు పోరాటాలకు దిక్సూచిగా నిలిచిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి అన్నారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల సందర్భంగా మండలంలోని సీదుగూడెం గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు,సిపిఐ సినియర్ నాయకులు వాకిటి సాయిరెడ్డి స్థూపానికి పూలమాలలు వేసి నివాలర్పించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వెట్టిచాకిరీ,భూస్వామ్య పెత్తందారులకు,నిజాం అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటాన్ని కొంత మంది మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రికరించే కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉడుత రామలింగం,ఎఐవైఎఫ్ నాయకులు కొండూరు వెంకటేష్,బద్దుల సుధాకర్,దాసరి కృష్ణ,రోషనగారి అంజయ్య,కుంటి పాపయ్య,ఉబ్బు సుదర్శన్,దాసరి యాదయ్య,గుండెబోయిన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/బీబీనగర్ : మండలంలోని మగ్గంపల్లి గ్రామానికి చెందిన పొన్నం లక్ష్మణ్ అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ దాతలు ఎరసాని రాములు, బండారు బాలకృష్ణ వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.10,500 ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. వారి వెంట ఎంజాల వెంకటేష్, బండారు శ్రావణ్ కుమార్, గోరుకంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాపక్షం/నిడమనూరు: బిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గిరిజన తండాల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న చర్యలను కొనియాడుతూ మండల పరిధి మర్లగడ్డ తండాలో గిరిజన మహిళలు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి రిజర్వేషన్లు పెంపొందించడంతోపాటు తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించి గిరిజన సంక్షేమానికి ఎనలేని పూజ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నల్ల



బోతు వెంకటేశ్వర్లు సీనియర్ నాయకులు బొల్లం సైదయ్య యాదవ్, లకుమాల మధుబాబు,గన్నపాక లక్ష్మణ్,జోన్నలగడ్డ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్: తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి గిరిజనులకు ఆత్మగౌరవం కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ దేనని నాగార్జునసాగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి నోముల భగత్ కుమార్ అన్నారు.మండలంలోని రంగుండ్ల గ్రామంలో గురువారం గిరిజనులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు రిజర్వేషన్లు 6 శాతం నుంచి 10 శాతానికి పెంచినందుకు కృతజ్ఞతగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పిడిగం నాగయ్య ముదిరాజ్,బాణావత్ బాబురావు నాయక్,కేతావత్ బిక్షా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/నాంపల్లి : మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని తండాల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ర్యాలీలు నిర్వహించారు.జాన్ తండా మాజీ సర్పంచ్, మండల ఎస్‌టి సెల్ అధ్యక్షుడు సర్దార్ నాయక్,ఉపసర్పంచ్ ఉషారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకు రాజకీయంగా, సామాజికంగా అవకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. ఎస్‌టి రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచినందుకు గిరిజన సమాజం రుణపడి ఉంటుందని తెలిపారు.

